# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 279 | పేజీలు: 4 | వెల: రూ.4/- | శుక్రవారం 5 జూన్ 2026 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి




### భూముల విలువ పెంపు

## రిజిస్ట్రేషన్ ఆఫీసులకు పోటెత్తిన జనం

**తెలంగాణ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద భారీ రద్దీ**

**భూముల మార్కెట్ విలువలు, ఛార్జీల పెంపు నేపథ్యంలో జనం పరుగులు**

**రద్దీని దృష్టిలో ఉంచుకొని పనివేళలు పొడిగించిన ప్రభుత్వం**

**రాత్రి 7:30 గంటల వరకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు అనుమతి**

**హైదరాబాద్, జూన్ 4 (నమస్తే ఉదయం)**

తెలంగాణలో భూముల మార్కెట్ విలువలు, రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరగనున్నాయనే వార్తల నేపథ్యంలో సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలు జనంతో కిటకిటలాడాయి. పాత ధరలకే రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకునేందుకు గురువారం ఉదయం నుంచే ప్రజలు భారీగా తరలివచ్చారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ 4న రాత్రి 7:30 గంటల వరకు పనివేళలను పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న వాస్తవ ధరలకు, అధికారిక రిజిస్ట్రేషన్ విలువలకూ మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించడం ద్వారా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇది రేపటి నుంచి అమలులోకి వస్తుండటంతో, పెరిగే ఛార్జీల భారం ..మిగతా 2లో

# పాలమూరు పర్యటనలో రేవంత్ రెడ్డి

**కాట్రేవుపల్లి ఎత్తిపోతల పథకం పనుల పరిశీలన**

**పాలమూరు ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా రేవంత్ రెడ్డి మక్తల్ పర్యటన**

**కాట్రేవుపల్లిలోని మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం పనుల పరిశీలన**

**సీఎంతో పాటు కర్ణాటక మాజీ మంత్రి బోసురాజు**

పాలమూరు సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలు వేగవంతమే లక్ష్యంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా నారాయణపేట్ జిల్లా మక్తల్ మండలం కాట్రేవులపల్లి పరిధిలో కొనసాగుతున్న మక్తల్-నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులను సీఎం, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి తదితరులు పరిశీలించారు.

**మక్తల్, జూన్ 4 (నమస్తే ఉదయం)**





పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల స్థితిగతుల పరిశీలనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. ఉమ్మడి జిల్లాలోని నారాయణపేట-కొడంగల్, పాలమూరు-రంగారెడ్డితో పాటు పెండింగ్ ప్రాజెక్టుల పనులను క్షేత్రస్థాయిలో పరిశీస్తున్నారు. సాయంత్రం కొల్లాపూర్‌లోని సోమశిలలోనే సీఎం బస చేయనున్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులపై అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహిం చనున్నారు. రేపు పీఆర్ఎల్ఐ ప్రాజెక్టులోని ప్యాకేజీలను పరిశీలించుకుంటూ వచ్చిన అనంతరం జడ్చర్లలో భారీ బహిరంగ సభలో పాల్గొనున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టుల పనులపై ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రాజెక్టులను క్షేత్రస్థాయిలో సందర్శించి పనుల పురోగతిని పరిశీలించేందుకు సీఎం రేవంత్ పాలమూరు జిల్లాలో పర్యటిస్తున్నారు. ఇవాళ, రేపు మొత్తం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా పర్యటిస్తూ ఎత్తిపోతల పథకాలు, రిజర్వాయర్లు, పంప్ హౌస్‌లను పరిశీలిస్తున్నారు. మధ్యాహ్నం నారాయణ పేట జిల్లా మక్తల్ కు హెలికాప్టర్ ద్వారా చేరుకున్న సీఎం కొడంగల్ - నారాయణపేట ప్రాజెక్టుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం కోయిల్ సాగర్ ప్రాజెక్టు, కృష్ణా, ..మిగతా 2లో

# మళ్లీ డీలిమిటేషన్ బిల్లు..

**ప్రాంతీయ పార్టీలతో కేంద్రం రహస్య సంప్రదింపులు!**

**డీలిమిటేషన్ బిల్లుపై కేంద్రం**

**మరోసారి కసరత్తు చేస్తున్నట్లు సమాచారం**

**2029 ఎన్నికల లోపే పూర్తి చేయాలని యోచన**

**ప్రాంతీయ పార్టీలతో కేంద్రం సంప్రదింపులు**

**గతంలోని వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకొని ఆచితూచి అడుగులు**

**ఏకాభిప్రాయం కోసం ముందస్తు చర్చలు**



**హైదరాబాద్, జూన్ 4 (నమస్తే ఉదయం)**

నియోజకవర్గాల పునర్విభజన బిల్లును మరోసారి తెచ్చే యోచనలో కేంద్రం ఉ న్నట్లు తెలుస్తోంది. 2029 లోక్‌సభ ఎన్నికల కంటే ముందే ఈ ప్రక్రియను పూర్తి చేయడానికి కసరత్తు చేస్తోందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అయితే ఇది సున్నితమైన అంశం కావడంతో ఎలాంటి వివాదాలకు తావులేకుండా ..మిగతా 2లో

# టీఎంసీలో తీవ్ర సంక్షోభం

**మమతకు భారీ షాక్**

**బీజేపీ వైపు 20 మంది టీఎంసీ ఎంపీల చూపు!**

**ప్రతిపక్ష నేతగా రెబల్ ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీకి గుర్తింపు**

**బీజేపీతో టచ్‌లో 20 మంది టీఎంసీ ఎంపీలు ఉన్నట్లు ఊహాగానాలు**

**మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీపై అసంతృప్తితోనే తిరుగుబాటు**

**బెంగాల్‌లో పార్టీ కమిటీలన్నింటినీ రద్దు చేసిన టీఎంసీ**



**హైదరాబాద్, జూన్ 4 (నమస్తే ఉదయం)**

పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీ చరిత్రలోనే అతిపెద్ద సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత మొదలైన అసమ్మతి, ఇప్పుడు ఎమ్మెల్యేల తిరుగుబాటుతో తీవ్రస్థాయికి చేరింది. ఈ సంక్షోభం రాష్ట్రానికే పరిమితం కాకుండా, ఢిల్లీకి కూడా పాకింది. ఏకంగా 20 మంది లోక్‌సభ సభ్యులు పార్టీ మారేందుకు సిద్ధమవుతున్నారనే వార్తలు మమతా బెనర్జీకి ..మిగతా 2లో



## అమీర్‌పేటలో భారీ అగ్నిప్రమాదం

**స్తంభించిన ట్రాఫిక్**

**తొలుత ఆటబొమ్మల దుకాణంలో మంటలు**

**క్రమంగా కేఎస్ఆర్ కాంప్లెక్స్‌కు వ్యాప్తి**

**ఎలాంటి ప్రాణనష్టం లేదని పోలీసుల వెల్లడి**

**పొగ కమ్మేయడంతో నిలిచిపోయిన ట్రాఫిక్**

**హైదరాబాద్, జూన్ 4 (నమస్తే ఉదయం)**

నిత్యం రద్దీగా ఉండే హైదరాబాద్ అమీర్‌పేటలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. మైత్రివనం దగ్గర్లోని కేఎస్ఆర్ షాపింగ్ మాల్‌లో మంటలు చెలరేగాయి. తొలుత ఓ ఆటబొమ్మల దుకాణంలో చెలరేగిన మంటలు క్రమంగా ..మిగతా 2లో

## దేశంలో తొలి ఫ్లెక్స్-ఫ్యూయల్ కారు ఆవిష్కరణ

**మారుతి సుజుకి కీలక ముందడుగు...**

**మారుతి సుజుకి నుంచి దేశంలోనే తొలి ఫ్లెక్స్-ఫ్యూయల్ కారు ఆవిష్కరణ**

**100 శాతం ఇథనాల్‌తో నడిచేలా వ్యాగన్‌ఆర్ కొత్త మోడల్ రూపకల్పన**

**పాత వాహనాలను ఫ్లెక్స్-ఫ్యూయల్‌గా మార్చాలని కంపెనీలకు గడ్కరీ సూచన**

**డీజిల్‌లో 15% ఐసోబ్యూటనాల్ కలిపే యోచనలో ఉన్నామన్న కేంద్ర మంత్రి**

**కంప్రెస్డ్ బయోగ్యాస్, హైడ్రోజన్‌పైనా దృష్టి సారించామన్న మారుతి సుజుకి**




2

### ప్రతిపక్షాల సమావేశానికి

## డీఎంకే దూరం

**'ఇండి కూటమి'ని వీడుతోందా?**



**హైదరాబాద్, జూన్ 4 (నమస్తే ఉదయం)**

తమిళనాడులో కాంగ్రెస్, టీవీకే పొత్తుతో రగులుతున్న విభేదాలు- కూటమి భేటీకి డీఎంకే దూరంగా ఉండనున్నట్టు సమాచారం దిల్లీ వేదికగా జూన్ 8న జరగనున్న 'ఇండి' కూటమి భేటీకి డీఎంకే దూరంగా ఉండనుంది. ప్రతిపక్షాల ఐక్యతను చాటేందుకు ఇండి కూటమి నేతలు ..మిగతా 2లో

# ముఖ్యమంత్రి జిల్లా పర్యటన విజయవంతం







### గుడ్డెం దొడ్డి పంపుహౌస్‌ను పరిశీలించిన ముఖ్యమంత్రి

### జిల్లా ప్రాజెక్టులపై ఫోటో ఎగ్జిబిషన్ పీపిటి ప్రజెంటేషన్

### సీఎం పర్యటనకు భారీ బందోబస్తు

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 4( నమస్తే ఉదయం)**

జూరాల ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ద్వారా చేపట్టిన జవహర్ నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన గుడ్డెం దొడ్డి జలాశయం సామర్థ్యాన్ని 11 లేదా15 టీఎంసీలకు పెంచాలని స్థానిక ప్రజా ప్రతినిధులు, ఇరిగేషన్ శాఖ అధికారుల ప్రతిపాదనల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం పంపు హౌస్ ను సందర్శించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ అధికారులు ముఖ్యమంత్రికి జిల్లాకు అవసరమైన నీటి వనరుల సామర్థ్యం పెంపునకు అవసరమైన ప్రతిపాదనలను వివరించారు. ముఖ్యంగా గూడెం దొడ్డి ప్రాజెక్టు 15 టిఎంసిలకు పెంచడం, ర్యాలంపాడు సీపేజీ సమస్యను పరిష్కరించి నాలుగు టీఎంసీల నీటి స్టోరేజ్ నిలువ చేసే విధంగా చర్యలు చేపట్టాల్సి ఉందని అలాగే మల్లమ్మ కుంట భూసేకరణ పనులను చేపట్టాల్సిందని తెలియజేశారు. ఈ సందర్భంగా ధరూర్ మండలంలోని గుడ్డెం దొడ్డి రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్ద గురువారం సాయంత్రం 4:30 ప్రాంతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, తదితరులు బొకేలు, మొక్కలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి సీఎం రోడ్డు మార్గంలో జవహర్ నెట్టెంపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన స్టేజ్1 గుడ్డెం దొడ్డి పంపు హౌస్ వద్దకు చేరుకొని మంత్రులతో కలిసి జోగులాంబ గద్వాల జిల్లాలోని నీటి పారుదల ప్రాజెక్టులపై పిపిటి ద్వారా సమీక్ష నిర్వహించారు. అంతకుముందు జిల్లా ప్రాజెక్టుల గురించి ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను తిలకించారు. అనంతరం తిరిగి వెళ్లే సమయంలో సీఎం కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులకు, మీడియా ప్రతినిధులకు అభివాదం చేస్తూ కరచాలనం చేశారు. ఈ సందర్భంగా అభిమానులు సీఎంకు పుష్పగుచ్ఛాలు, శాలువాలు, జ్ఞాపికలు అందజేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట భద్రత చర్యలతో పాటు, పకడ్బందీ ఏర్పాట్లు చేసి స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారుల సహకారం, సమన్వయంతో ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసినట్లు గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, పశు సంవర్ధక, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, కర్నాటక మంత్రి బోసురాజు, గద్వాల, అలంపూర్ శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, విజయుడు, రాష్ట్ర వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, గొర్రెలు, మేకలు అభివృద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్ సరిత, అదనపు కలెక్టర్ మధుమోహన్, ఆర్డీవో శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, డీసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ సీఈ రహీముద్దీన్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, నేతలు, తదితరులు పాల్గొన్నారు.










### దేశంలో తొలి ఫ్లెక్స్-ఫ్యూయల్

# కారు ఆవిష్కరణ

**న్యూఢిల్లీ, జూన్ 4 (నమస్తే ఉదయం)**

దేశంలో ప్రత్యామ్నాయ, స్వచ్ఛమైన ఇంధనాల వినియోగాన్ని ప్రోత్సహించే దిశగా వాహన తయారీ దిగ్గజం మారుతి సుజుకి కీలక ముందడుగు వేసింది. దేశపు తొలి ఫ్లెక్స్-ఫ్యూయల్ ప్యాసింజర్ కారు 'వ్యాగన్‌ఆర్ ఫ్లెక్స్-ఫ్యూయల్' ప్రోటోటైప్‌ను గురువారం ఆవిష్కరించింది. ఈ కొత్త మోడల్ జు20 (20 శాతం ఇథనాల్) నుంచి జు100 (100 శాతం ఇథనాల్) వరకు ఎలాంటి ఇథనాల్-పెట్రోల్ మిశ్రమంతోనైనా నడిచే సామర్థ్యం కలిగి ఉండటం విశేషం.

పెట్రోల్‌పై ఆధారపడటాన్ని తగ్గించి, జీవ ఇంధనాల వాడకాన్ని పెంచాలన్న భారత ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఈ కారును అభివృద్ధి చేసినట్లు కంపెనీ తెలిపింది. ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రత్యామ్నాయ ఇంధన వ్యూహంలో భాగంగా డీజిల్‌లో 15 శాతం ఐసోబ్యూటనాల్‌ను కలిపే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోందని వెల్లడించారు.

పాత వాహనాలను యూరో 6 ప్రమాణాలకు అనుగుణంగా ఫ్లెక్స్-ఫ్యూయల్ వెహికల్స్‌గా మార్చేందుకు కృషి చేయాలని మారుతి సుజుకి, హీరో మోటోకార్ప్ వంటి సంస్థలను గడ్కరీ కోరారు. ఈ చర్యలతో వాయు కాలుష్యాన్ని నియంత్రించవచ్చని, వెహికల్ స్క్రాపేజ్ కార్యక్రమానికి మద్దతు లభిస్తుందని అన్నారు. భారత ఆర్థిక వ్యవస్థకు ఆటోమొబైల్ రంగం కీలక చోదకశక్తి అని, ప్రస్తుతం ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆటో పరిశ్రమగా భారత్ నిలిచిందని ప్రశంసించారు.

మారుతి సుజుకి ఎండీ, సీఈఓ హిసాషి టేకూచి మాట్లాడుతూ, కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ), హైడ్రోజన్ వంటి ఇతర క్లీన్ టెక్నాలజీలపై కూడా తాము దృష్టి సారించామని వివరించారు. గత ఆర్థిక సంవత్సరంలో దేశంలో అమ్ముడైన మొత్తం గ్రీన్ వెహికల్స్‌లో దాదాపు సగం మారుతి సుజుకివేనని కంపెనీ మార్కెటింగ్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ తెలిపారు.

ప్రస్తుతం ఈ కారును సాధారణ వినియోగదారులకు కాకుండా, కేవలం ఓలా, ఉబర్ వంటి ఫ్లీట్ ఆపరేటర్లు, ఇతర కమర్షియల్ అవసరాల కోసం మాత్రమే అందుబాటులోకి తెచ్చారు. ఈ కొత్త వ్యాగన్‌ఆర్‌లో 1.2-లీటర్, 4-సిలిండర్ ఖ12చీ ఇంజిన్‌ను ఉపయోగించారు. అధిక ఇథనాల్ వాడకానికి అనువుగా ఉండేలా ఇంజిన్‌లో ప్రత్యేక మార్పులు చేశారు. అయితే, వాహనం పవర్, మైలేజ్ వివరాలను కంపెనీ ఇంకా అధికారికంగా వెల్లడించలేదు.

ఈ కొత్త మోడల్ ధరను ఇంకా ప్రకటించనప్పటికీ, సాధారణ పెట్రోల్ వేరియంట్ కంటే కాస్త ఎక్కువగా ఉండవచ్చని భావిస్తున్నారు. కారు వెనుక భాగంలో 'ఫ్లెక్స్ ఫ్యూయల్' బ్యాడ్జ్‌ను అమర్చడం మినహా డిజైన్‌లో పెద్దగా మార్పులు లేవు.

# మళ్లీ డీలిమిటేషన్ బిల్లు..

మొదటి పేజీ తరువాయి...

రాజకీయంగా ఏకాభిప్రాయం సాధించాలని ప్రభుత్వం యత్నిస్తున్నట్లు సదరు వర్గాలు వెల్లడించాయి. ఈ సంప్రదింపుల్లో భాగంగా కేంద్రం ఇప్పటికే తమిళనాడుకు చెందిన డీఎంకేతో పాటు పలు కీలక ప్రాంతీయ పార్టీలతో ప్రాథమిక చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం దేశంలో ఉన్న లోక్‌సభ స్థానాల సంఖ్య 1971 జనాభా లెక్కల ఆధారంగానే చేసి ఉంది. ఆ గడువు ముగియనుండటంతో కొత్తగా పునర్విభజన చేపడితే జనాభా ఎక్కువగా ఉన్న ఉత్తరాది రాష్ట్రాలకు సీట్లు పెరిగి, జనాభాను నియంత్రించిన దక్షిణాది రాష్ట్రాలు రాజకీయంగా నష్టపోతాయనే తీవ్ర ఆందోళనలు ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే అందరికీ ఆమోదయోగ్యమైన ఫార్ములాను రూపొందించేందుకు కేంద్రం యత్నిస్తోందని సమాచారం. నిజానికి ఇటీవలే కేంద్ర ప్రభుత్వం నియోజకవర్గాల పునర్విభజన బిల్లును పార్లమెంటు ముందుకు తీసుకువచ్చింది. అయితే ఆ సమయంలో ప్రాంతీయ పార్టీల నుంచి, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఫలితంగా ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమై పార్లమెంటులో వ్యతిరేకంగా ఓటు వేయడంతో బిల్లు వీగిపోయింది. దీన్ని దృష్టిలో పెట్టుకునే.. ఈసారి బిల్లును నేరుగా సభలో పెట్టకుండా, ముందుగానే విస్తృత అవగాహన కుదిరిన తర్వాతే తదుపరి అడుగు వేయాలని కేంద్రం భావిస్తోందని ప్రభుత్వ వర్గాల ద్వారా తెలుస్తోంది.




# అమీర్‌పేటలో భారీ అగ్ని ప్రమాదం

మొదటి పేజీ తరువాయి...

షాపింగ్ కాంప్లెక్స్ మొత్తం వ్యాపించాయి. పెద్ద ఎత్తున ప్లాస్టిక్ వస్తువులు ఉండడంతో మంటలు వేగంగా అంటుకున్నాయి. మైత్రివనం ప్రాంతంలో అనేక ఆఫీసులు, కోచింగ్ సెంటర్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు ఉంటాయనే విషయం తెలిసిందే.

మంటల ధాటికి ఆ ప్రాంతమంతా పెద్ద ఎత్తున పొగ అలముకుంది. రోడ్డు కనపడనంత తీవ్రంగా పొగ కమ్మేయడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నాయి. నాలుగు ఫైరింజన్లు మంటలను ఆర్పుతున్నాయి. మరోవైపు పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు.

మంటలు చెలరేగిన వెంటనే షాపింగ్ కాంప్లెక్స్‌లోని వారంతా బయటకు పరిగెత్తుకొచ్చారు. దీంతో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని ప్రాథమికంగా పోలీసులు తేల్చారు. కానీ, చాలా దుకాణాలు దగ్ధం అవడంతో ఆస్తి నష్టం మాత్రం భారీగా ఉండే అవకాశం ఉంది. అలాగే షార్ట్ సర్క్యూటే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని అనుమానిస్తున్నారు. మరోవైపు సమీపంలోనే మెట్రో స్టేషన్‌లో కార్యకలాపాలకు ఎలాంటి అంతరాయం లేదని అధికారులు తెలిపారు. సర్వీసులు యథావిధిగా కొనసాగుతున్నట్లు చెప్పారు.



# టీఎంసీలో తీవ్ర సంక్షోభం

మొదటి పేజీ తరువాయి...

కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. జూన్ 3న, పార్టీ నుంచి బహిష్కరణకు గురైన ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీని ప్రతిపక్ష నేతగా అసెంబ్లీ స్పీకర్ రతీంద్ర బోస్ గుర్తించారు. తమకు 58 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని రెబల్ వర్గం ప్రకటించింది. దీంతో అసెంబ్లీలో మమతా బెనర్జీ వర్గం బలహీనపడింది. మొత్తం 80 మంది టీఎంసీ ఎమ్మెల్యేలలో అధికశాతం మంది రెబల్ వర్గం వైపు ఉన్నారు. ఏప్రిల్-మే నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 15 ఏళ్ల టీఎంసీ పాలనకు తెరపడిన తర్వాత ఈ సంక్షోభం మొదలైంది. ప్రతిపక్ష నేత ఎంపిక విషయంలో పార్టీ అధిష్టానం తీసుకున్న నిర్ణయాన్ని రెబల్ ఎమ్మెల్యేలు వ్యతిరేకించారు. మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ వ్యవహార శైలి, ఎన్నికల ఓటమి తర్వాత ఆయన పెత్తనం చెలాయించడమే ఈ తిరుగుబాటుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. తామంతా మమతా బెనర్జీ నాయకత్వాన్ని గౌరవిస్తామని, కానీ అభిషేక్ పెత్తనాన్ని సహించబోమని రెబల్ ఎమ్మెల్యేలు స్పష్టం చేస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో, సుమారు 20 మంది టీఎంసీ ఎంపీలు బీజేపీ నాయకులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇది నిజమైతే, పార్లమెంటులో మమతా బెనర్జీ బలం మరింత క్షీణిస్తుంది. ఇటీవల మమత నిర్వహించిన నిరసన కార్యక్రమానికి కేవలం ఆరుగురు ఎంపీలు, ఎనిమిది మంది ఎమ్మెల్యేలు మాత్రమే హాజరుకావడం ఆమె చుట్టూ విధేయుల సంఖ్య తగ్గుతోందనడానికి నిదర్శనంగా కనిపిస్తోంది. ఈ తిరుగుబాటు నేపథ్యంలో టీఎంసీ బెంగాల్‌లోని అన్ని కమిటీలను రద్దు చేసి, ఆత్మపరిశీలన చేసుకుంటామని ప్రకటించింది.

### ప్రతిపక్షాల సమావేశానికి

# డీఎంకే దూరం

మొదటి పేజీ తరువాయి...

జూన్ 8న దేశ రాజధానిలో సమావేశం కానున్నారు. అయితే, తమిళనాడులో ఇటీవల జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీతో డీఎంకేకు సంబంధాలు క్షీణించాయి. ఫలితంగా ఈ భేటీకి డీఎంకే నేతలు దూరంగా ఉండనున్నారు. ఈ సమావేశంలో సుమారు 17 ప్రతిపక్ష పార్టీలు పాల్గొనే అవకాశం ఉంది. ఈ భేటీలో చట్టసభల లోపల, బయట అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించనున్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీ విజయ్ నేతృత్వంలోని టీవీకేతో చేతులు కలపడం డీఎంకేకు ఆగ్రహం తెప్పించింది. ఇరు పార్టీల మధ్య తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలోనే ఇండి కూటమి భేటీకి, డీఎంకే గైర్హాజరు కావడం ఖాయంగా కనిపిస్తోంది. మరోవైపు కూటమితో అంటీముట్టనట్లు వ్యవహరిస్తూ వచ్చిన టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ ఈ సమావేశానికి హాజరవుతారని సమాచారం. ఆమెతో పాటు ఇటీవల దాడికి గురైన టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ కూడా పాల్గొనే అవకాశం ఉంది. వీరితో పాటు పలు రాష్ట్రాల సీఎంలు, సీనియర్ నేతలు సమావేశానికి హాజరుకానున్నారు.

### భూముల విలువ పెంపు

# రిజిస్ట్రేషన్ ఆఫీసులకు పోటెత్తిన జనం

మొదటి పేజీ తరువాయి...

నుంచి తప్పించుకునేందుకు కొనుగోలుదారులు కార్యాలయాల వద్ద బారులు తీరారు. ప్రజల రద్దీ, విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న రెవెన్యూ శాఖ, ప్రత్యేకంగా గురువారం పనివేళలను పొడిగించింది. టోకెన్లు తీసుకున్న వారందరి రిజిస్ట్రేషన్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించింది. ప్రభుత్వం పనివేళలు పొడిగించి సౌలభ్యం కల్పించినా, భారీ సంఖ్యలో జనం రావడంతో వ్యవస్థపై ఒత్తిడి నెలకొంది.

# పాలమూరు పర్యటనలో రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి...



భీమా నదులపై ప్రతిపాదిత బ్రిడ్జి కమ్ బ్యారేజీలు ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టును ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. పాలమూరు ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా ముఖ్యమంత్రి, మంత్రులు కాట్రావుపల్లిలో ఎత్తిపోతల పథకం, ప్రతిపాదిత బ్యారేజీలపై ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీ వీక్షించారు. సీఎంతో పాటు కర్ణాటక మాజీ మంత్రి బోసురాజు కూడా మక్తల్ చేరుకున్నారు.

సాయంత్రం జోగులాంబ గద్వాల జిల్లాకు చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధరూర్ మండలం గుడ్డందొడ్డి హెలిప్యాడ్ చేరుకున్నారు. గుడ్డందొడ్డి రిజర్వాయర్, జవహర్ లాల్ నెహ్రూ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం ఫేజ్-1 ను పరిశీలించారు. గుడ్డందొడ్డి రిజర్వాయర్ ప్రస్తుత సామర్థ్యం 1.5 టీఎంసీలు కాగా 15 టీఎంసీలకు పెంచాలని ప్రతిపాదన సాధ్యాసాధ్యాలపై పరిశీలించారు. నెట్టెంపాడు ఫేజ్-1 పంప్ హౌస్ పరిశీలన, ఫొటో ఎగ్జిబిషన్ వీక్షించారు. పాలమూరు ప్రాజెక్టుల పరిస్థితి, నీటి నిల్వ సామర్థ్యంపై వీడియో ప్రదర్శించారు.

సోమశిలలోనే సీఎం బస : ఆ తర్వాత హెలికాప్టర్ ద్వారా బయలుదేరి సాయంత్రం 6 గంటలకు నాగర్ కర్నూలు జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలోని సోమశిలకు చేరుకున్నారు. అక్కడి మృగవాణి రిసార్ట్ రివర్ ఫ్రంట్ లో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని అన్ని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. కొల్లాపూర్‌లోని సోమశిలలోనే సీఎం బస చేయనున్నారు.

# అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 13 మంది రౌడీషీటర్ల బైండోవర్



రౌడీ షీటర్ లకు కౌన్సిలింగ్ ఇస్తున్న రాజేంద్రనగర్ డీసీపీ ఎస్ శ్రీనివాస్. చిత్రంలో అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ నాగేశ్వర్ రావు



బైండోవర్ అయిన రౌడీ షీటర్ లు

**బుద్వేల్, జూన్ 4 (నమస్తే ఉదయం)**

పద్ధతి మార్చుకుని సక్రమంగా ఉంటే మంచిది.. లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ డీసీపీ ఎస్ శ్రీనివాస్ అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్లు గా ఉన్నవారికి సూచించారు. గురువారం అత్తాపూర్ లో రౌడీషీటర్లు గా ఉన్న 13 మందిని బైండోవర్ చేశారు. రాజేంద్రనగర్ జోన్ పరిధిలో శాంతిభద్రతలను కాపాడటానికి, నేరాలను అదుపు చేయడానికి పోలీసులు కఠినంగా వ్యవహారించడం జరుగుతుందన్నారు. అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న 13 మంది రౌడీషీటర్లను ఎక్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి బైండోవర్ చేయడం జరిగిందన్నారు. భవిష్యత్తులో ఎలాంటి గొడవలకు పాల్పడకుండ ఉండాలని వారికి సూచించారు. బైండోవర్ అయిన రౌడీషీటర్లలో మహ్మద్ మోహినుద్దీన్, మహ్మద్ షాహబాజ్ఖాన్, ఎండీ ఖదీర్, ఎండీ యాసీన్, సయ్యద్ ఇమ్రాన్, మహ్మద్ అజ్మత్, షేక్ రశీద్, మహ్మద్ ఒమర్, సయ్యద్ జకరియ అహ్మద్ అలియాస్ షాహెజ్, మహ్మద్ యూసుఫ్ అలియాస్ యూనుస్ మాము, ఎండీ అలీఖాన్, ఎస్కొ కుర్బాన్, మహ్మద్ షరీఫ్ లు ఉన్నారు.



మాజీ మంత్రి హరీశ్ రావు జన్మదినం సందర్భంగా గురువారం ఆయన నివాసంలో కలసి మొక్క ను బహుకరించి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పోరెడ్డి ధర్మారెడ్డి, తెలంగాణ ఉద్యమ నాయకులు ఎర్రోళ్ల యాదయ్య, వీర్లపల్లి నవీన్ కుమార్, తదితరులు.

-బుద్వేల్, నమస్తే ఉదయం





రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి ని కలసి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు పెండ్యాల శ్రీధర్, తదితరులు

## ఘనంగా రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు

**బుద్వేల్, జూన్ 4 (నమస్తే ఉదయం)**

రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం రాజేంద్రనగర్ లో ఘనంగా నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులు, అధికారులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు కలిసి ఆయనను శాలువాతో సన్మానించి పుష్పగుచ్చాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంచి అధికారిగా సోలిపేట శ్రీనివాస్ రెడ్డికి పేరు ఉందని గుర్తు చేసుకున్నారు. రాజేంద్రనగర్ ప్రాంతానికి సోలిపేట శ్రీనివాస్ రెడ్డి సూపరుచితులు అని ఇక్కడ అనేక మందితో ఆయనకు సత్సంబంధాలు ఉన్నాయని గుర్తు చేసుకున్నారు. శ్రీనివాస్ రెడ్డి కి భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, సుఖ సంతోషాలతో విలసిల్లాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నామన్నారు.



సోలిపేట శ్రీనివాస్ రెడ్డి

# ఢిల్లీ అగ్నిప్రమాద ఘటనలో మరో విషాదం

## ఒకే కుటుంబానికి చెందిన 8మంది దుర్మరణం

**న్యూఢిల్లీ,జూన్ 04(నమస్తే ఉదయం)**

దక్షిణ ఢిల్లీలోని మాలవీయ నగర్‌లో గల ఫ్లోరిష్ స్టే రెస్టారెంట్‌లో బుధవారం ఉదయం జరిగిన ఘోర అగ్ని ప్రమాదం ఘటనలో 21 మంది ప్రాణాలు కోల్పోగా.. పలువురు గాయపడ్డారు. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన 8 మంది మృతిచెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. గురుగ్రామ్‌లోని సెక్టార్ 46కు చెందిన వివేక్ అగర్వాల్ అనే చార్టర్డ్ అకౌంటెంట్.. మ్యాక్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తన తండ్రిని పరామర్శించేందుకు ఢిల్లీ వెళ్లారు. ఆయనతో పాటు తల్లి ప్రేమ్ లత, భార్య తర్జనీ అగర్వాల్, ఇద్దరు కుమార్తెలు జివిషా, వారియా, మరో ముగ్గురు బంధువులూ ఉన్నారు. వీరంతా బస చేసేందుకు.. ప్రమాదానికి గురైన ఫ్లోరిష్ స్టే బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్‌లో 2 గదులను బుక్ చేసుకున్నారు. వీరు అల్పాహారం తీసుకుంటుండగా ఒక్కసారిగా ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో మొత్తం 8 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ కుటుంబంలో ప్రాణాలతో మిగిలిన ఏకైక వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వివేక్ అగర్వాల్ తండ్రి రాధేశ్యామ్ అగర్వాల్(80) మాత్రమే. ఒకే కుటుంబంలోని 8 మంది మరణించడంతో గురుగ్రామ్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. కాగా.. డీఎన్ఏ టెస్టుల అనంతరం బంధువులకు మృతదేహాలను అప్పగిస్తామని అధికారులు పేర్కొన్నారు. బుధవారం ఉదయం 8:30 గంటలకు ఆ రెస్టారెంట్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఇరుకైన భవనం కావడంతో వేగంగా మంటలు వ్యాపించాయి. ఎంట్రీ, ఎగ్జిట్ ఒకేచోట ఉండటంతో అందులో ఉన్నవారు తప్పించుకునేందుకు వీలులేకుండా పోయింది. ప్రమాద సమయంలో అందులో సుమారు 40 మంది ఉన్నట్టు సమాచారం. వారిలో 21 మంది చనిపోగా.. కొందరు ప్రాణాలు కాపాడుకునేందుకు కిటికీలు, భవనం పైనుంచి దూకి తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో విదేశీయులే ఎక్కువ మంది ఉన్నట్టు తెలుస్తోంది. వీరంతా సెంట్రల్ ఆసియా, ఆఫ్రికా నుంచి చికిత్స కోసం అక్కడికి వచ్చినట్లు అధికారులు తెలిపారు. కాగా.. ఢిల్లీ ప్రభుత్వం బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ పథకం కింద ఆ హోటల్‌కు లైసెన్స్ మంజూరు చేసింది. దీని ప్రకారం.. ఆ ప్రాపర్టీలో 6 గదులకే అనుమతి ఉండగా.. బేస్‌మెంట్‌లోని కొన్ని గదులతోపాటు మొత్తం 25 గదులతో ఆ రెస్టారెంట్‌ను నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది.





ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్‌ను కలసి వినతి పత్రం అందచేస్తున్న ధోభీ ఘాట్ వాసులు

## దోబిఘాట్‌లో డ్రైనేజ్ పైపులైన్‌ను ఏర్పాటు చేయాలి

**బుద్వేల్, జూన్ 4 (నమస్తే ఉదయం) :**

బుద్వేల్ దోబిఘాట్ వీధిలో డ్రైనేజీ సమస్యలను పరిష్కరిం చాలని ఆ కాలనీ వాసులు గురువారం మైలార్దేవుపల్లి లోని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్ నివాసానికి వెళ్లి వినతి పత్రం అందజేశారు. డ్రైనేజీ పైపు లైన్ సరిగ్గా లేకపోవడంతో చాలా ఇబ్బందిగా ఉందని కాలనీ వాసులు జి శ్రీనివాస్ రెడ్డి, సతీశ్ తదితరులు ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. గతంలో డ్రైనేజీ పైపు లైన్ కోసం వినతి పత్రం అందజేయగా, అంచనాలు తయారు చేశామని, హెడ్ ఆఫీస్ కు పంపించామని చెప్పి అధికారులు చేతులు దులుపుకున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ స్పందించి డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు.



బవానీ కాలనీ లో రోడ్ల పరిస్థితిని పరిశీలిస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

## బవానీ కాలనీలో ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ పర్యటన

**బుద్వేల్, జూన్ 4 (నమస్తే ఉదయం)**

రాజేంద్రనగర్ సర్కిల్ బవానీ కాలనీ లో గురువారం రాజేం ద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్ అధికారులతో కలిసి పర్యటించారు. కాలనీ లో చేపట్టనున్న 2.51 కోట్ల రోడ్డు పనులను త్వరగా ప్రారంభించాలని ఇంచార్జి ఎస్ఈ నరేందర్ గౌడ్ కు సూచించారు. ఏఏ వీధిలో రోడ్లు వేయనున్నారో.. ఆ రోడ్లను అధికారులతో కలసి పరిశీలించారు. రోడ్లు పనులను నాణ్యతగా చేపట్టాలన్నారు. సీసీ రోడ్లు వేసిన ఆరు నెలలకే పాడైతున్నాయనే ఆరోపణలు ఉన్నాయని అలా జరుగకుండ చూడాలని నరేందర్ గౌడ్ కు సూచించారు. కాలనీ వాసులు అభివృద్ధి పనులు జరుగుతున్న సమయంలో నాణ్యత ప్రమాణాలు పాటించేటట్లు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాజేం ద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్ల పరిధిలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు. నిత్యం ప్రజల మధ్య లో ఉండి వారి కష్టసుఖాలలో పాలుపంచుకుంటు ముందుకు సాగుతున్నామన్నారు. ఎక్కడైన పనులలో నాణ్యత లేకపోతే అది ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తుందని అధికారులు గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం శ్రీనివాస్ యాదవ్, అక్కెం క్రిష్ణాయాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు టి ప్రేంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్ రెడ్డికి పదోన్నతి

### పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ) గా బదిలీ అయిన వెంకట్ రెడ్డి

**రాజేంద్రనగర్,జూన్04(నమస్తే ఉదయం)**

రాజేంద్రనగర్ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో)వెంకట్ రెడ్డికి పదోన్నతి లభించింది.డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఉన్న ఆయనను రాష్ట్ర ప్రభుత్వం అదనపు కలెక్టర్ గా పదోన్నతి కల్పిస్తూ పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ)గా నియమించింది. ప్రమోషన్‌తో పాటు ఆయనను రాజేంద్రనగర్ నుంచి పెద్దపల్లికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాజేంద్రనగర్ ఆర్డీవోగా పనిచేసిన వెంకట్ రెడ్డితన విధుల్లో సమర్ధవంతంగా పనిచేసి మంచి గుర్తింపు పొందారు.ఆయనకు పదోన్నతి రావడంతో అధికారులు,సిబ్బంది,ప్రజాప్రతినిధులు అభినందనలు తెలియజేశారు.

# విద్యుత్ డిమాండ్‌కి అనుగుణంగా నూతన సబ్ స్టేషన్లు, ట్రాన్స్ఫార్మర్లు

**ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి**

**నూతన సబ్ స్టేషన్ల కోసం స్థలాల కేటాయింపు**

**అతి త్వరలో 4 నూతన సబ్ స్టేషన్ల ప్రారంభం**

**ఇనుప స్తంభాలను వెంటనే తొలగించండి**

**స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ సమస్యల పరిష్కారం**




**పటాన్ చెరు, జూన్ 4 (నమస్తే ఉదయం):**

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్ చెరు నియోజకవర్గంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ కి అనుగుణంగా నూతన సబ్ స్టేషన్లతో పాటు ట్రాన్స్ఫార్మర్ల, స్థంభాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం పటాన్చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యుత్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధానంగా నూతన సబ్ స్టేషన్ల ఏర్పాటు, విద్యుత్ సరఫరా, భూ కేటాయింపులు, పూర్తయిన సబ్ స్టేషన్ల ప్రారంభోత్సవాల అంశాలపై చర్చించారు. పటాన్ చెరు డివిజన్ పరిధిలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నిర్మించిన ఇండోర్ సబ్ స్టేషన్, సింఫనీ కాలనీ, పోచారం, లకడారం సబ్ స్టేషన్లు పనులు తుది దశకు చేరుకున్నాయని అతి త్వరలో వీటిని ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. మాదారం, రామేశ్వరంబండ, ఉస్మాన్నగర్, బొల్లారంల పరిధిలో సబ్స్టేషన్ల ఏర్పాటు కోసం భూ కేటాయింపులు సైతం పూర్తయ్యాయని,ఆర్థిక శాఖ నుండి ఒక్కో సబ్స్టేషన్కు ఐదు కోట్ల రూపాయల నిధులు మంజూరు కావాల్సి ఉందని తెలిపారు. వెంటనే నిధులు మంజూరు చేయాలని సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు విన్నవించడం జరిగిందని తెలిపారు. నియోజకవర్గ పరిధిలో ఇనుప విద్యుత్ స్తంభాలు ఎట్టి పరిస్థితుల్లో ఉండకూడదని .. తక్షణమే తొలగించి సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ఘాతంతో పశువులు మృతి చెందితే కాలయాపన చేయకుండా వెంటనే సంబంధి రైతులకు నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నూతన సబ్స్టేషన్ల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు అందిస్తే రెవెన్యూ అధికారులతో చర్చించి స్థలాలు కేటాయించడం జరుగుతుందని అధికారులకు తెలిపారు. ప్రస్తుత వేసవికాలంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతర విద్యుత్ అందించి అద్భుతంగా పనిచేశారని అభినందించారు. ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లోనూ పని చేయాలని కోరారు. మున్సిపాలిటీల పరిధిలో సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ తాగునీటి సరఫరాకు విద్యుత్ కోతలు లేకుండా చూడాలని కోరారు. శిథిలావస్థలో ఉన్న స్తంభాలను వెంటనే తొలగించడంతోపాటు నూతన స్తంభాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిధుల అంశంలో ఇబ్బందులు తలెత్తితే వెంటనే తన దృష్టికి తీసుకొని రావాలని.. వివిధ పరిశ్రమల యాజమాన్యాలతో చర్చించి సిఎస్ఆర్ నిధులు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ డిఈ భాస్కరరావు, ఏడిఈ లు సంజయ్, దుర్గా ప్రసాద్, నాగరాజు, జిన్నారం మాజీ జెడ్పీటీసీ కొలన్ బాల్ రెడ్డి, ఏఈలు పాల్గొన్నారు.

## వాటర్ బిల్లుల పేరుతో నయా మోసం..

# క్షణాల్లో లక్షలు కాజేస్తున్న సైబర్ నేరగాళ్లు!

**శేరిలింగంపల్లి : జూన్ 4,(నమస్తే ఉదయం)**

నగరంలో సైబర్ నేరగాళ్లు సరికొత్త మోసాలకు తెరలేపారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు అధికారులమంటూ రంగంలోకి దిగి ప్రజల బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. వాటర్ బిల్లు అప్‌డేట్ కాలేదని, మీటర్ రీడింగ్ పెండింగ్‌లో ఉందంటూ భయపెట్టి లక్షలాది రూపాయలు కాజేస్తున్నట్లు సైబరాబాద్ సైబర్ క్రైమ్స్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ టి. సాయి మనోహర్ తెలిపారు. ఈ మేరకు ఆయన ప్రజలను అప్రమత్తం చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు.

**మోసం చేసే విధానం ఇదీ..**

బాధితులకు వాట్సాప్, ఎస్ఎంఎస్ లేదా ఫోన్ కాల్స్ ద్వారా సైబర్ కేటుగాళ్లు సంప్రదిస్తున్నారు. మీ కన్స్యూమర్ అకౌంట్ నంబర్ వెరిఫికేషన్ పెండింగ్‌లో ఉంది. ఈరోజు రాత్రికి మీ నీటి కనెక్షన్ కట్ చేస్తాం అంటూ కంగారు పెడుతున్నారు. ఆ సమస్య తీరాలంటే కేవలం 10 లేదా రూ.20 చెల్లించాలంటూ నమ్మిస్తారు. ఇందుకోసం వారు పంపే ఏపికే ఫైళ్లను లేదా క్విక్ సపోర్ట్ వంటి రిమోట్ యాక్సెస్ యాప్‌లను డౌన్‌లోడ్ చేయమని సూచిస్తారు.

**యాప్ డౌన్‌లోడ్ చేస్తే అంతే సంగతులు!**

బాధితులు ఆ యాప్‌లను ఇన్‌స్టాల్ చేయగానే అసలు కథ మొదలవుతుంది. ఆ తర్వాత ఫోన్ అకస్మాత్తుగా హ్యాంగ్ అవ్వడం లేదా స్క్రీన్ స్పందించకపోవడం జరుగుతుంది. ఈ లోపు ఆ యాప్‌ల సహాయంతో నేరగాళ్లు బాధితుల మొబైల్ స్క్రీన్‌ను, ఓటీపీలను, బ్యాంకింగ్ వివరాలను పూర్తిగా తమ ఆధీనంలోకి తెచ్చుకుంటారు. బాధితులకు తెలియకుండానే వారి బ్యాంక్ ఖాతాలు, యూపీఐ, క్రెడిట్ కార్డుల నుండి వేల నుంచి లక్షల రూపాయలను క్షణాల్లో గుంజేస్తున్నారు.

**పోలీసులు సూచిస్తున్న జాగ్రత్తలు**

అనుమానాస్పద సందేశాలు, కాల్స్‌ను గుడ్డిగా నమ్మకండి. అపరిచితులు వాట్సాప్‌లో పంపే ఎలాంటి ఫేక్ ఫైళ్లను క్లిక్ చేయవద్దు. అలాగే క్విక్ సపోర్ట్, ఎనీ డెస్క్ వంటి రిమోట్ యాప్‌లను ఇన్‌స్టాల్ చేయకూడదని వివరించారు. మీ ఓటీపీ, సీవీవీ, యూపీఐ పిన్, బ్యాంక్ పాస్‌వర్డ్‌లను ఎవరికీ చెప్పకూడదని వివరించారు. వాటర్ బిల్లు లేదా కనెక్షన్ వివరాలను అధికారిక వెబ్‌సైట్ లేదా యాప్ ద్వారా మాత్రమే చెక్ చేసుకోవాలి సూచించారు.ఒకవేళ మోసపోతే వెంటనే మొబైల్ డేటా లేదా వైఫై ఇంటర్నెట్‌ను వెంటనే బంద్ చేయాలని వివరించారు. ఫోన్‌లోని అనుమానాస్పద యాప్‌లను వెంటనే డిలీట్ చేయాలని బ్యాంక్ అకౌంట్లు, కార్డులు, యూపీఐ సేవలను వెంటనే బ్లాక్ చేయావహాలని డీసీపీ సాయి మనోహర్ తెలిపారు. మోసానికి గురైన వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేసి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని చెప్పారు.



సైబరాబాద్ సైబర్ క్రైమ్ డిసిపి సాయి మనోహర్..

# నీటి సంరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత

**కూకట్‌పల్లిలో ఇంకుడు గుంతలను ప్రారంభించిన జలమండలి ఎండీ అశోక్ రెడ్డి**









**హైదరాబాద్, జూన్ 4 (నమస్తే ఉదయం)**

భవిష్యత్తు తరాలకు నీటి భద్రతను కల్పించేందుకు వర్షపు నీటి సంరక్షణ అత్యంత కీలకమని జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి అన్నారు. గురువారం కూకట్‌పల్లి జోన్ పరిధిలో కేబీహెచ్ బీ పార్క్ ప్రాంతంలో నిర్వహించిన జలసంరక్షణ అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని, నూతనంగా నిర్మించిన ఇంకుడు గుంతలను ప్రారంభించారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో కలిసి వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, నీటి వనరుల పరిరక్షణపై అవగాహన కల్పించారు. నగరంలో పెరుగుతున్న నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఇంటి వద్ద, ప్రతి సంస్థలో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు.ఈ సందర్భంగా ఎండీ అశోక్ రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో నీటి సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకించేలా ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టడం ద్వారా భూగర్భ జలాల మట్టాలను పెంచవచ్చని తెలిపారు. ప్రతి వర్షపు నీటి బొట్టు భవిష్యత్తు తరాలకు విలువైన ఆస్తి అని పేర్కొన్నారు.కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీవాసులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఇంకుడు గుంతను నిర్మించి ప్రారంభించడం అభినందనీయమని ఎండీ అన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే నీటి సంరక్షణ కార్యక్రమాలు ఉద్యమ రూపం దాల్చుతాయని పేర్కొన్నారు. అలాగే జలమండలి ఆధ్వర్యంలో కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలో ఉపయోగంలో లేని బోర్లను ఇంజెక్షన్ బోర్లుగా మార్చేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. అందులో భాగంగా, ఇంజెక్షన్ బోర్లుగా మార్చిన 40 బోర్లను ఆయన వర్చ్యువల్ గా ప్రారంభించారు.జలమండలి ఆధ్వర్యంలో ఈ సంవత్సరంలో ఇప్పటికే 24 వేల ఇంకుడు గుంతల నిర్మాణం పూర్తయిందని, నగర వ్యాప్తంగా 30 వేల ఇంకుడు గుంతల నిర్మాణం లక్ష్యంగా కార్యాచరణ కొనసాగుతోందని తెలిపారు. మిగిలిన లక్ష్యాలను కూడా నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.అలాగే నగర పరిధిలో 700 పనిచేయని బోర్ వెల్ ను గుర్తించామని, వాటిని భూగర్భ జలాల రీఛార్జ్‌కు ఉపయోగపడే ఇంజెక్షన్ బోర్‌వెల్లుగా మార్చేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని ఎండీ వెల్లడించారు. ఇందులో భాగంగా ఇప్పటికే 350 పాడైన బోర్‌వెల్లను ఇంజెక్షన్ బోర్‌వెల్లుగా మార్చామని, మిగిలిన వాటిని కూడా త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు.నీటి సంరక్షణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు. ప్రజల భాగస్వామ్యంతోనే ఈ కార్యక్రమాలు విజయవంతమవుతాయి. ప్రతి గృహం, అపార్ట్‌మెంట్, వాణిజ్య సముదాయాలు ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలి. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూమిలోకి ఇంకించడం ద్వారా భూగర్భ జలాలను పెంచడంతో పాటు భవిష్యత్తు నీటి అవసరాలను సురక్షితం చేయవచ్చు అని ఎండీ అశోక్ రెడ్డి అన్నారు.వీటితోపాటు ప్రజలు తమ రోజువారీ నీటి వినియోగ అలవాట్లలో చిన్న మార్పులు తీసుకువస్తే సుమారు 30 శాతం వరకు నీటి వినియోగాన్ని తగ్గించే అవకాశం ఉంది. నీటి సంరక్షణను ప్రతి కుటుంబం సామాజిక బాధ్యతగా భావించి ముందుకు రావాలి అని ఎండీ పేర్కొన్నారు.200 గజాలకు పైబడిన స్థలంలో నిర్మించిన ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రతి నివాస సముదాయంలో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయడం ద్వారా నగరంలో 5 నుంచి 10 టీఎంసీల వరకు వర్షపు నీటిని భూగర్భంలోకి చేరవేయవచ్చని తెలిపారు. ఆలా చేస్తే భవిష్యత్తులో కృష్ణ తాగునీటి సరఫరా పథకం--4, కొత్తగా ఇతర నీటి సరఫరా పథకాల నిర్మాణాలు అవసరం ఉండదు అని అన్నారు.అనంతరం స్థానిక కాలనీవాసులు జల సంరక్షణ, ఇంకుడు గుంతల నిర్మాణం, నీటి వృథా నివారణకు కట్టుబడి ఉంటామని.. ఇంటింటా రైన్‌వాటర్ హార్వెస్టింగ్ కార్యక్రమానికి సంపూర్ణ సహకారం అందిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఈడీ సంతోష్, ఆపరేషన్ డైరెక్టర్లు నారాయణ, ప్రభు, జీఎం హరి శంకర్, ఇంకుడు గుంతుల ప్రత్యేక అధికారి సత్యనారాణ, ఇతర అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘాల సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# గ్రామ సమగ్ర అభివృద్ధి చేపడుతాం

**నర్కూడ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్**

**గ్రామంలో 60 లక్షలతో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శ్రీకారం**

**శంషాబాద్, జూన్ 4(నమస్తే ఈ)**

గ్రామ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని నర్కూడ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ అన్నారు. గురు గ్రామంలో 60 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు గ్రామ వార్డు సభ్యులు, నాయకుల తో కలిసి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ మాట్లాడుతూ, "నర్కూడ గ్రామ అభివృద్ధే నా లక్ష్యం. గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తూ, ప్రతి అభివృద్ధి కార్యక్రమంలో ముందుండి పనిచేస్తాను. గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తాను" అని తెలిపారు.గ్రామ అభివృద్ధికి పెద్దపీట వేస్తూ వరుసగా అభివృద్ధి పనులు చేపడుతున్న సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ నాయకత్వాన్ని గ్రామ ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ నీరటి మహేష్, వార్డు సభ్యులు పర్వతం వెంకటయ్య, చౌట రాజు, తొంట జంగమ్మ,కనకమామిడి విష్ణు, కుంచ లత-కుమార్ గౌడ్, బుర్కుంట నాగరాజు, పర్వతం వినోద్, లింగం సంధ్య-నవీన్, గూడెపు నీరజ-లక్ష్మణ్, కర్రె అఖిల-గణేష్ , గ్రామ నాయకులు నీరటి శేఖర్, తొంట అశోక్, చందనవెల్లి శ్రీనివాస్, నీరటి అశోక్, టి. కుమార్ గౌడ్, హిరేకర్ శివాజీ, గడ్డం మల్లేష్ యాదవ్, రక్షిత్ గౌడ్,గ్రామ పెద్దలు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల

# నియంత్రణపై దృష్టి

**మానవ అక్రమ రవాణాను నిరోధించేలా చర్యలు**

**సుప్రీంకోర్టు పలు కీలక ఆదేశాలు**

**న్యూఢిల్లీ,జూన్4 (నమస్తే ఉదయం)**

పిల్లల అక్రమ రవాణా నిరోధానికి సంబంధించిన కేసులో విచారణ చేపడుతున్న సుప్రీంకోర్టు.. సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల నియంత్రణపై దృష్టి సారించింది. ఈ కేసులో అమికస్ క్యూరీగా వ్యవహరిస్తున్న సీనియర్ అడ్వకేట్ అపర్ణా భట్ చేసిన సూచనలను పరిశీలించింది. మానవ అక్రమ రవాణాను నిరోధించేలా సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల కోసం ప్రత్యేక మార్గదర్శకాలు (ఎస్ఓపీ) లేవని ఆమె ఈ సందర్భంగా కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. సరోగసీ, ఐవీఎఫ్ క్లినిక్స్ నియంత్రణ కోసం తీసుకొచ్చిన ఏఆర్టీ చట్టంలో అనేక నిబంధనలు ఉన్నప్పటికీ, చిన్నారుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక ప్రోటోకాల్ లేదని అపర్ణా భట్ పేర్కొన్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనలు ప్రధానంగా వైద్య ప్రమాణాలు, మౌలిక వసతులకే పరిమితమయ్యాయని వివరించారు. ఈ నేపథ్యంలో నిబంధనలను మరింత కట్టుదిట్టం చేసేందుకు రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. కమిటీ సూచనలతో సమగ్ర విధానాన్ని రూపొందించాలని ప్రతిపాదించారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం తన అభిప్రాయాన్ని తెలియజేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఆగస్టు 19కి వాయిదా వేసింది.

## ట్రెక్కింగ్‌కు వెళ్లిన

# యువతి అదృశ్యం

**స్నేహితులను అరెస్ట్ చేసి విచారణ**

**న్యూఢిల్లీ,జూన్4 (నమస్తే ఉదయం)**

స్నేహితులతో కలిసి ట్రెక్కింగ్‌కు వెళ్లిన ఓ యువతి కనిపించకుండా పోయింది. 6 రోజులు గడుస్తున్నా ఆమె ఆచూకీ దొరకలేదు. పోలీసులు ఆమె స్నేహితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఉత్తరాఖండ్‌లోని నైనితాల్‌కు చెందిన బబితా పాండే అనే యువతి ఎంబీఏ చేస్తోంది. వారం రోజుల క్రితం ఆమె తన స్నేహితులు హర్మన్‌పాల్ సింగ్, హర్మన్ ప్రీత్ సింగ్‌లతో కలిసి టూర్‌కు వెళ్లింది. మే 25వ తేదీన వారు హర్సిల్, గంగోత్రితో పాటు చుట్టుపక్కల ఉన్న పర్యాటక ప్రదేశాల్లో తిరిగారు. ముగ్గురూ మే 28వ తేదీన రైతాల్ గ్రామానికి వెళ్లారు. ఆ రోజు అక్కడే ఉన్నారు. మరుసటి రోజు రైతాల్ నుంచి దయారా బుగ్యాల్‌కు ట్రెక్కింగ్ మొదలెట్టారు. ఆ రాత్రి గోయ్ బేస్ క్యాంప్‌లో బస చేశారు. అర్ధరాత్రి నుంచి బబిత కనిపించకుండాపోయింది. బబిత స్నేహితులు ఆమె కోసం వెతికారు. ఆమె ఎక్కడా కనిపించకపోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆర్మీ, ఇండో - టిబెటన్ బోర్డర్ పోలీస్, స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, పోలీస్, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌కు చెందిన 150 మంది ఆమె కోసం వెతుకుతున్నారు.